సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం ၊ 21 ၊ నవంబర్ ၊ 2022



వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలను చిత్రీకరిస్తున్న పర్యాటకులు



జెండాకొండపై గుడారాలు ఏర్పాటు చేసుకున్న పర్యాటకులు

న్యూస్‌రీల్

వచ్చే ఎన్నికల్లోగా టీడీపీ ఖాళీ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: రాబోయే అసెంబ్లీ ఎన్నికలలోపు టీడీపీ ఖాళీ అవ్వడం ఖాయమని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలోని ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఆధ్వర్యంలోని పెదగూడ స్వతంత్ర ఎంపీటీసీ గణపతి, టీడీపీ ముఖ్య నాయకులు శంకరరావు, దామోదరం, మఠం గణపతి,రాజులు, రాజేంద్రపసాద్, చిట్టపులి గణపతితో పాటు మరో 30 మంది టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆపరేటర్ పోస్టులకు 167 దరఖాస్తులు

రంపచోడవరం: రంపచోడవరం సబ్ కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న రెండు అవుట్ సోర్సింగ్ ఆపరేటర్ల నియమాకాలకు సంబంధించి 167 దరఖాస్తులు వచ్చినట్లు సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. ఆపరేటర్ల ఎంపికకు సంబంధించి ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు కాకినాడలోని ఎన్ఐసీ విభాగంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారులు పరీక్షకు హాజరు కావాల్సిన వివరాలను రంపచోడవరం తహసీల్దార్, మండల పరిషత్, కార్యాలయాలు, గ్రామసచివాలయం నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. వివరాలకు 08864–243561 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

క్రీడాకారుడికి చేయూత



కొర్రా గోపీకి రన్నింగ్ షూను అందజేస్తున్న కార్యదర్శి తదితరులు..

అనంతగిరి: అంతర్జాతీయ మారథాన్ పోటీలకు ఎంపికైన కొత్తూరు పంచాయతీ తుమ్మనవలస గ్రామానికి చెందిన క్రీడాకారుడు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కొర్రా గోపీకి రూ.8500 విలువైన రన్నింగ్ షూస్‌ను అమ్మ చారిటబుల్ సమకూర్చింది. వీటిని ఆదివారం కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ట్రస్టు సభ్యులు అందజేశారు. మహిళ పోలీస్ నీలవేణి, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల కారు బోల్తా



అదుపుతప్పి బోల్తాకొట్టిన పర్యాటకుల కారు

అనంతగిరి: మండలంలోని తుమ్మనవలస సమీపంలోని మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి పర్యాటకుల కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆదివారం అరకు అందాలను తిలకించిన తరువాత ఇద్దరు పర్యాటకులు కారులో మైదాన ప్రాంతానికి బయలుదేరారు. ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డుపక్కకు అదుపుతప్పి బోల్తా కొట్టింది. అయితే ఈ ప్రమాదంలోని ఇద్దరు పర్యాటకులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పర్యాటకుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భక్తిశ్రద్ధలతో అంబలం పూజ



పూజలు చేస్తున్న అయ్యప్ప మాలధారులు

కొయ్యూరు: మండల కేంద్రంలో శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో అంబలం పూజ నిర్వహించారు. రాజేంద్రపాలెం, కొయ్యూరు తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి పైగా అయ్యప్ప మాలధారులు తరలివచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

పర్యాటకం కళకళ



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

- పోటెత్తిన సందర్శకులు
- వీకెండ్ కావడంతో శనివారం నుంచి సందడి
- కళకళలాడిన రిసార్టులు
- పర్యాటకశాఖకు భారీగా ఆదాయం

సాక్షి, పాడేరు : జిల్లా వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం రద్దీ నెలకొంది. రంపచోడవరం, మొహిదీపట్నం, మారేడుమిల్లి, చింతూరు, మోతుగూడెం, సీలేరు, చింతపల్లి, జీకేవీధి, జి. మాడుగుల, డుంబ్రిగుడ, అరకులోయ, హుకుంపేట, అనంతగిరి ప్రాంతాల్లోని అన్ని పర్యాటక ప్రదేశాల్లో శనివారం రాత్రి నుంచే పర్యాటకుల సందడి నెలకొంది. చింతపల్లి మండలంలోని చెరువులవేనం, పాడేరు మండలంలోని వంజంగి హిల్స్, అరకులోయ మండలంలోని మాడగడ కొండ ప్రాంతాల్లో సూర్యోదయం, ప్రకృతి మంచు అందాలను పర్యాటకులు వీక్షించారు. అలాగే అన్ని జలపాతాల వద్ద పర్యాటకులు అలరించారు. అరకులోయలోని గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ తదితర ప్రాంతాలు, రిసార్టులు పర్యాటకులతో కళకళలాడాయి.

కొత్తపల్లి జలపాతం..

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఆంధ్ర–ఒడిశా తెలంగాణ రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేశారు. వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. బండరాళ్లపై నుంచి ప్రకృతి అందాలను తిలకించారు. పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా మేనేజర్ ఆర్ నవీన్, సూపర్‌వైజర్ అభి, రాజు తదితరులు పర్యవేక్షించారు.

జలపాతాలకు తాకిడి

జి.మాడుగుల: మండలంలోని జి.మాడుగుల, సొలభం పంచాయతీల్లోని కొత్తపల్లి, అక్కాచెల్లెలగుమ్మి జలపాతాలకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కొత్తపల్లి దిగువన ఉన్న సుందరమైన జలపాతానికి సరైన మెట్లు మార్గం, అక్కాచెల్లెల గుమ్మి జలపాతానికి రోడ్డు మార్గం లేక పర్యాటకులు కొంత ఇబ్బంది పడ్డారు.

జెండాకొండపై..

హుకుంపేట: అత్యంత ఎత్తయిన సీతమ్మపర్వతం (జెండా కొండ)పై ప్రకృతి అందాలు తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. శనివారం రాత్రి కొండదిగువున ఓలుబెడ్డా గ్రామంలో గుడారాలు ఏర్పాటుచేసుకుని బసచేశారు. తెల్లవారుజామున మంచు అందాలు, సూర్యోదయం, ప్రకృతి రమణీయ దృశ్యాలను తిలకించారు. తేనెపట్టు గుహలు, థింసారాళ్లు, గొడుగురాయి, హుండీ గుడ్డి గుమ్మి జలపాతాలను సందర్శించారు.

పూతిగుంట పరమేశ్వరుని ఆలయానికి..

వై.రామవరం: కార్తీకమాసంలో చివరి ఆదివారం కావడంతో మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని ఆలయానికి భక్తులు, పర్యాటకులు పోటెత్తారు. జలపాతంలో స్నానాలు చేసి శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి వనభోజనాలు చేశారు. ఆలయం, జలపాతం పరిసరాలు సందడిగా మారాయి.

పింజరికొండకు..

అడ్డతీగల: వీకెండ్ కావడంతో ఆదివారం మండలంలోని పింజరికొండ జలపాతానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీ తరలివచ్చారు. ఇక్కడ గతంలో ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో పోలీసులు పర్యాటకులను పరిమిత సంఖ్యలో అనుమతిస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు 6కిలో మీటర్ల దూరంలో ఉంది.

ఇక్కడ ఎటువంటి సౌకర్యాలు లేవు. ఎకో టూరిజం ప్రాజెక్ట్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు ఉన్నా ముందుకు సాగలేదు. ఇది కార్యరూపం దాల్చితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని యువత ఆశిస్తోంది. పైడిపుట్ట వద్ద కన్నేరు వాగుకు పర్యాటకుల తాకిడి నెలకొంది.

చాపరాయిలో..

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైపులా ఉన్న వలిసె పూల అందాల్లో ఫొటోలు తీసుకుని ఉల్లాసంగా గడిపారు. బేంబూ చికెన్ అమ్మకాలు భారీగా జరిగాయి.

జి.మాడుగుల: చింతపల్లి, జి.మాడుగుల మండలాల్లోని లంబసింగి, తాజంగి తదితర పర్యాటక ప్రాంతాల్లో జబర్దస్త్ నటుడు నాగు తదితరులు సందర్శించారు.వీరికి రిటైర్డు ఎంపీడీవో ప్రేమాకర్ తదితరులు ఆహ్వానం పలికారు.


బొర్రా గుహలకు పర్యాటకుల తాకిడి



అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలు ఆదివారం పర్యాటకులతో కళకలాడింది. పర్యాటకులు రాకతో గుహలు ప్రాంగణం సందడి వాతవరణం నెలకొంది. ఉదయం నుంచే గుహలు అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. తాటిగుడ, సరియా, కటికి, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ సందర్శిత ప్రాంతాలకు పర్యాటకులు పోటెత్తారు.



డుంబ్రిగుడ మండలం చాపరాయి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



పింజరికొండ జలపాతం వద్ద పరిమిత సంఖ్యలో సందర్శకులు



పూతిగుంట పరమేశ్వరుని ఆలయం వద్ద జలపాతంలో స్నానాలు చేస్తున్న సందర్శకులు



సీతమ్మపర్వతం(జెండాకొండ)పై మంచు అందాలు, సూర్యోదయాన్ని తిలకిస్తున్న పర్యాటకులు



లంబసింగి రిసార్ట్స్‌లో జబర్దస్త్ నటుడు నాగు తదితరులు

ఆశ్రమ, గురుకులాల్లో సీసీ కెమెరాలు

- ఐటీడీఏలో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం
- పర్యవేక్షించిన పీవో గోపాలకృష్ణ
- స్టడీ సమయంలో లేకపోవడంపై ఆగ్రహం
- సంబంధిత టీచర్లకు షోకాజ్ నోటీసులు



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి స్టడీ విధానంపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు తీసుకుంది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల స్టడీ విధానాన్ని ఇక ఐటీడీఏ నుంచి ప్రాజెక్టు అధికారి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ప్రతిరోజు పర్యవేక్షిస్తారు. ఐటీడీఏ పరిధిలోని 122 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలాల్లో ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని పాడేరు ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉపాధ్యాయులు సక్రమంగా బోధిస్తున్నారా లేదా, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా లేదా అనే విషయం ఇట్టే గుర్తించవచ్చు. ఆదివారం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ. కొండలరావు, ఐటీడీఏ ఏపీవో వీఎస్ ప్రభాకర్‌రావు పరిశీలించారు. ట్రయల్ రన్‌గా పాడేరు గిరిజన గురుకుల కళాశాలలో విద్యార్థుల స్టడీ విధానాన్ని ఐటీడీఏ పీవో పరిశీలించారు. స్టడీ సమయంలో తరగతి గదిలో లేకపోవడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉపాధి జాతర

- వ్యవసాయ సీజన్‌లోనూ పనులు
- రూ.24.85 కోట్ల కేటాయింపు



కూనవరం మండలంలో ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న భూమి అభివృద్ధి పనులు

చింతూరు: చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఉపాధ పనుల జాతర కొనసాగుతోంది. నిరుపేదలకు 150 రోజులు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా అధికారులు వివిధ పనులు చేపడుతున్నారు. ప్రస్తుతం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న ఉపాధి పనులు మాత్రం ఎక్కడా ఆగడంలేదు. గతంలో వ్యవసాయ పనుల సీజన్‌లో ఉపాధి పనులు చేపట్టడం ద్వారా తమకు కూలీలు లభించడం కష్టమవుతోందని రైతులు ఆవేదన చెందేవారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ సీజన్ పూర్తయ్యేవరకు ఉపాధి పనులు ఆపి సీజన్ పూర్తయిన తరువాత యధావిధిగా పనుల కొనసాగించేవారు. కాగా ఆ విధానానికి స్వస్తి పలికి వ్యవసాయ సీజన్‌లోనూ నిరాటంకంగా పనులు కొనసాగిస్తుండడంతో ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు మండలాల్లో 46,013 కుటుంబాలుండగా 44,709 జాబ్‌కార్డులు వున్నాయి. 1,09,137 మంది ఉపాధి కూలీలుండగా వీరికి ఈ ఏడాది 11,43,007 పనిదినాల కల్పన లక్ష్యం కాగా ఇప్పటివరకు 11,15,759 పనిదినాలు కల్పించారు.

పనుల వివరాలిలా..

ప్రస్తుతం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో మట్టి పనుల్లో భాగంగా ఫారం ఫండ్స్, చిన్న చెరువుల పూడికతీత, భూముల అభివృద్ధిలో భాగంగా భూములను చదును చేయడం వంటి పనులు నిర్వహిస్తున్నారు. అమృత్ సరోవర్ పథకంలో ఆయకట్టు రైతులకు నీరందించడంలో భాగంగా పెద్ద చెరువుల అభివృద్ధి పనులు చేపడతున్నట్లు అధికారులు తెలిపారు.

- ఈ ఏడాది నుంచి కొత్తగా వ్యవసాయ భూముల్లోని రాళ్లను ఏరి సరిహద్దుల ఏర్పాటు, మారుమూల గ్రామాల్లో కనెక్టవిటీ నిమిత్తం చిన్నపాటి మట్టి రహదారుల నిర్మాణం. గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు కనెక్టవిటీ నిమిత్తం మట్టిరోడ్ల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

పోడు గిరిజనులకు ..

గిరిజన ప్రాంతాల్లో పోడుభూముల పట్టాలు కలిగివున్న గిరిజనులకు 150 రోజుల పనిదినాలు పూర్తయితే మరో 50 రోజుల పాటు అదనపు పనిదినాలు కల్పిస్తున్నట్లు ఉపాధి ఏపీడీ రోశయ్య తెలిపారు. నాలుగు మండలాల్లో ఇప్పటివరకు 4,350 పోడు పట్టాదారులకు గాను 2,505 మందికి 50 రోజుల అదనపు పనిదినాలు కల్పించామని ఆయన తెలిపారు.

ఉపాధి పనుల వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	ఉపాధి కూలీలు	పనిదినాలు	చెల్లించిన నగదు (రూ.కోట్లలో)
చింతూరు	12,128	34,190	3,15,708	7.61
కూనవరం	9,764	22,868	2,48,621	5.3
ఎటపాక	14,300	32,735	2,87,038	5.9
వీఆర్‌పురం	8,517	19,344	2,64,392	6.04
మొత్తం	44,709	1,09,137	11,15,759	24.85

నేటి నుంచి ఈక్రాప్ రశీదుల పంపిణీ

- ఏర్పాట్లు పూర్తి
- అడ్డతీగల వ్యవసాయశాఖ ఏడీ సావిత్రి

అడ్డతీగల: ధాన్యం సహా ఇతర వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు మార్గం సుగమం చేయడానికి ఈక్రాప్ రశీదులు సోమవారం నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేశామని అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు కంకిపాటి సావిత్రి తెలిపారు. ఈ మేరకు మండలాల వారీగా ఈ క్రాప్ రశీదులు అందజేయనున్న రైతుల వివరాలను ఆమె వెల్లడించారు. సబ్‌డివిజన్ పరిధిలో 16,255 మంది రైతులకు ఈ క్రాప్ రశీదులు అందజేస్తామని ఆమె వివరించారు.అడ్డతీగల మండలం 4,479 మంది, గంగవరం మండలంలో 3,292 , వై.రామవరంలో 3,507, రాజవొమ్మంగిలో 4,977 మంది రైతులకు ఈ క్రాప్ రశీదులు పంపిణీ చేస్తామన్నారు. మరో 920 మంది రైతుల్లో కొంతమంది చనిపోవడం వృద్ధాప్యంలో ఉన్న వారి పూర్తి వివరాలు సేకరించవలసి ఉన్నందున పెండింగ్‌లో పెట్టామన్నారు. ఈకేవైసీ పూర్తిచేసుకున్న ప్రతి ఒక్క రైతుకు ఈ క్రాప్ రశీదులు ఇస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ సహాయకులుతో రశీదులు అందజేస్తామన్నారు. ధాన్యం సహా ఇతర వ్యవసాయ ఉత్పత్తుల విక్రయానికి రైతులు ఈ క్రాప్ రశీదులు వినియోగించుకోవచ్చన్నారు. ఇవి కలిగి ఉన్న వారే పంటల కొనుగోలు, పంటల బీమా, వడ్డీ రాయితీ తదితర సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు.

వణికిస్తున్న చలి



రాజవొమ్మంగి శివారు అప్పలరాజుపేటలో చలిమంట కాగుతున్న గిరిజనులు

రాజవొమ్మంగి: మన్యప్రాంతంలో గత మూడు రోజులుగా చలివాతావరణం గణనీయంగా పెరిగింది. ఉదయం వేళలో దట్టంగా కురుస్తున్న మంచుకు గిరిప్రజలు వణికిపోతున్నారు. ఆదివారం రాత్రి మండలవ్యాప్తంగా మరింత చలిపెరగడంతో స్థానికులు బెంబేలెత్తారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువ కావడంతో మండల పరిసరాల్లో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నీటితో నిండుకుండను తలపిస్తున్నాయి. నీటి వనరులు పెరగడం వల్ల కూడా చలి విపరీతంగా పెరిగిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చలి నుంచి ఉపశమనానికి సాయంకాలం ఉదయం వేళల్లో మంటలను ఆశ్రయిస్తున్నారు. ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. మరోవైపు చలికి తట్టుకోలేని పిల్లలు, వద్ధులు ఇళ్లల్లోంచి బయటకు రావడం లేదు.

పెరిగిన ఉన్నిదుస్తుల విక్రయాలు

మండల కేంద్రంలో గత కొద్దిరోజులుగా ఉన్నిదుస్తులు, దుప్పట్లు, రగ్గుల విక్రయాలు బాగా పెరిగాయి. స్థానికులే కాక బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వారు దుకాణాలు ఏర్పాటుచేశారు. వీరితో పాటు ద్విచక్రవాహనాలపై గ్రామాలకు వెళ్లి విక్రయిస్తున్నారు.



రాజవొమ్మంగిలో దట్టంగా కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలంలో చలి తీవ్రత పెరిగింది. ఉదయం పూట మంచు విపరీతంగా కురుస్తోంది. దీనికి తోడు చలిగాలులు తోడవ్వడంతో గిరిజనులు గజగజ వణుకుతున్నారు. ఆదివారం ఉదయం మండలంలోని సుజనకోట, పనసపుట్టు, పెదగూడ, దారెల పంచాయతీలో మత్స్యగెడ్డ పరివాహిక గిరిజన గ్రామాల్లో మంచు దట్టంగా కురిసింది. ఉదయం 10గంటల వరకు ముంచుతెరల్లోనే ఆయా ప్రాంతాలున్నాయి. దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలు హెడ్‌లైట్ వెలుతురులోరాకపోకలు కొనసాగాయి.



ముంచంగిపుట్టులో హెడ్‌లైట్ వెలుగులో వాహన రాకపోకలు

సహకారం.. సద్వినియోగం

ప్రభుత్వం అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకున్న గిరి రైతు ప్రసాద్ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పంపిణీ చేసిన కమలా మొక్కలు సంరక్షించి సేంద్రియ విధానంలో సాగు చేపట్టడంతో అధిక దిగుబడి నిస్తున్నాయి. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండించడంతో మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ధర కూడా లభిస్తోందని రైతు తెలిపాడు.

- ఉపాధి హామీలో కమలా తోటల పెంపకం
- సేంద్రియ విధానంలో సాగు
- మంచి దిగుబడి, ధర పొందుతున్న గిరి రైతు ప్రసాద్

గూడెంకొత్తవీధి: మన్యం పేరు చెప్పగానే మధురమైన సేంద్రియ ఫలాలు గుర్తుకు వస్తాయి. ప్రస్తుతం అందరికీ ఆరోగ్యంపై ధ్యాస పెరిగింది. అందుకే రసాయనాలు లేకుండా పండించిన సేంద్రియ పంటలకు దేశవ్యాప్తంగా గిరాకీ పెరుగుతోంది.స్థానికంగా కూడా గిరిజన రైతులు పండించే వివిధ రకాల కాయగూరలు, పండ్లకు డిమాండ్ ఏర్పడుతోంది.



సేంద్రియ విధానంలో పండించిన కమలాపండ్లు

కార్తీకమాసం కావడంతో మంచి డిమాండ్!

కార్తీకమాసం కావడంతో ప్రస్తుతం పూజలతో పాటు శాఖాహారులు ఎక్కువగా మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించే పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పనసపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతు ప్రసాద్ తమ తోటలో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కమాలాపండ్లను వారపుసంతలు, ప్రధాన కూడళ్లలో విక్రయాలు చేస్తున్నారు. ఈయనకు గతంలో ఉపాధి హామీ పథకం కింద అధికారులు కమలా మొక్కలను పంపిణీ చేశారు. వాటిని జాగ్రత్తగా సంరక్షించడంతో అవి ప్రస్తుతం మంచి దిగుబడులను ఇస్తున్నాయి.

ఆసక్తి చూపుతున్న వినియోగదారులు

ఎటువంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు, రసాయనాలు లేకుండా పండించినవి కావడంతో వినియోగదారులు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో గత మూడేళ్లనుంచీ ఈయన వారపుసంతలకు కమలాపండ్లను స్వయంగా తీసుకువచ్చి సేంద్రియ ఫలాలను అమ్ముతుండడంతో అంతా వీటిని కొనుగోలు చేస్తున్నారు. మాండ్‌ను బట్టి కిలో రూ.50 నుంచి రూ.60 వరకూ అమ్ముతున్నారు. ఏటా కేవలం కమలా పండ్ల విక్రయాల వల్ల సుమారు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తోందని రైతు ప్రసాద్ తెలిపారు.



కమలాపండ్లను వారపు సంతలో విక్రయిస్తున్న గిరిజన రైతు ప్రసాద్

క్లుప్తంగా

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతుడు నారాయణరావు(ఫైల్)

కోటవురట్ల: చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రామచంద్రపురానికి చెందిన మనసాల నారాయణ రావు(52) ఆదివారం కూలిపనికి వెళ్లి టేకు చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిరుపేద అయిన నారాయణరావు నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాల కళాకారులకు డ్యాన్స్ నేర్పుతుంటాడు. కూలిపని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో ఆరోగ్యం


యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: నిత్యం యోగాసనాలు చేయడంతో నాడీ వ్యవస్థ మెరుగుపడే విధంగా శరీరంలో అన్నీ అవయవాలు పనిచేస్తాయని యోగా గురువులు కామేశ్వరరావు, లక్ష్మీ సౌజన్య, సత్యనారాయణరాజు తెలిపారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరిసపల్లి దత్త క్షేత్రంలోని గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఆదివారం జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులతో యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు, భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలలు దగ్ధమై.. బతుకు బూడిదై..

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం
- ఊపిరాడక తండ్రీ, కొడుకుల మృతి
- తల్లీ కూతుళ్ల పరిస్థితి విషమం.. కేజీహెచ్‌కు తరలింపు

ముచ్చటైన కుటుంబం వారిది.. అనుబంధాలు పెనవేసుకున్న వారి అందాల పొదరింటిలో ఆనందాల హరివిల్లు నిత్యం నాట్యం చేస్తుంది.. అందుకే విధికి కూడా కన్ను కుట్టింది.. వారి ఆశలను తుంచేస్తూ, కలల్ని కాల్చేస్తూ అగ్నిప్రమాదం పొట్టన పెట్టుకుంది.. ఆదివారం తెల్లవారుజామున నిద్రలో ఉండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఊపిరాడక తండ్రీ కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రాణాలతో బయటపడ్డ తల్లీ కూతుళ్లు విశాఖ కేజీహెచ్‌లో విషమ స్థితిలో చికిత్స పొందుతున్నారు.



నానాజీ, మౌలేష్ మృతదేహాలు


జాహ్నవి, సుజాత (ఫైల్)


అగ్ని ప్రమాదం జరిగిన ఇల్లు.. కింద షాపు, పై రెండు అంతస్తుల్లో నివాసం


మంటల వల్ల మసిబారిన ఇల్లు

నర్సీపట్నం: కార్తీక ఆదివారం త్రిమూర్తుల పూజ చేసుకోవడం వారికి ఆనవాయితీ. అందుకే విశాఖలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న కుమారుడిని ముందు రోజే ఇంటికి రప్పించారు. శనివారం రాత్రి పొద్దుపోయేవరకు తల్లీ తండ్రీ, ఇద్దరు పిల్లలు హాయిగా కబుర్లు చెప్పుకున్నారు. నిద్రకు ఉపక్రమించాక వేకువజామున జరిగిన ప్రమాదం వారి కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పట్టణంలోని కృష్ణాబజార్ సెంటర్లో ఈ ఘోరం జరిగింది. బంగారు వ్యాపారి నవర మల్లేశ్వరరావు (నానాజీ) (45) అంబికా జ్యుయలర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. షాపుపైనే రెండంతస్తుల డూప్లెక్స్ ఇంట్లో భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. కుమారుడు మౌలేష్ (19) విశాఖలోని ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం, కుమార్తె జాహ్నవి మాకవరపాలెంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నారు. శనివారం రాత్రి నానాజీ, భార్య సుజాత, కుమారుడు మౌలేష్ పైఅంతస్తులో పడుకున్నారు. కుమార్తె జాహ్నవి కింద అంతస్తులో పడుకుంది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇల్లంతా దట్టమైన పొగతో ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరయ్యారు. ఒకపక్క మంటలు, మరోపక్క పొగతో కారు చీకటిలో ఎటువెళ్లాలో తెలియక ఆందోళన చెందారు. ×ఇంట్లో మంటలు వ్యాపించాయి.. రక్షించమ౯ని నానాజీ పక్కింట్లో నివాసం ఉంటున్న సోదరుడు అప్పారావుకు ఫోన్ చేశారు. ఇల్లంతా తాళాలు వేసి ఉండడంతో సోదరుడు, అతని కుటుంబ సభ్యులకు కాపాడేందుకు అవకాశం లేకుండా పోయింది. సుమారు 40 నిమిషాలపాటు నానాజీ రక్షించమని ఫోన్లో అరుస్తూనే ఉన్నా.. రెండంతస్తుల్లో ఉన్న నాలుగు గేట్లకు తాళాలు వేసి ఉండడంతో లోనికి ప్రవేశించలేకపోయారు. సోదరుడు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు హుటాహుటిన చేరుకొని, గేట్ల తాళాలను కట్టర్‌తో పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. కింద అంతస్తులో అపస్మారకస్థితిలో పడి ఉన్న జాహ్నవిని స్థానికుల సాయంతో తాళ్లతో కిందకు దించారు. ఆపై అంతస్తులో నానాజీ, సుజాత, మౌలేష్ కింద పడి ఉన్నారు. నానాజీ అప్పటికే మృతి చెందగా.. కొనఊపిరితో ఉన్న మౌలేష్‌ను తాళ్లతో కిందకు దించుతుండగా మరణించాడు. పరిస్థితి విషమంగా ఉన్న సుజాతను, కుమార్తె జాహ్నవిని తొలుత ఏరియా ఆస్పత్రికి, ఆ తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, సీఐ గణేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని విద్యుత్ శాఖ అధికారులు ధ్రువీకరించారు.

పవర్ లిఫ్టింగ్‌లో రోహిత్ ప్రతిభ



మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, గాంధీజీ వీధికి చెందిన అంజూరి రోహిత్‌కుమార్ ఈ నెల 16 నుంచి 19 వరకు నేపాల్‌లో జరిగిన ఎస్‌బీకేఎఫ్ 7వ అంతర్జాతీయ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. అక్కడ బెంచ్ ప్రెస్ 110 కేజీల విభాగం, డెడ్ లిఫ్ట్ 180 కేజీలలో చక్కటి ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. చెన్నైలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న రోహిత్ ఇంటర్ నుంచి పవర్ లిఫ్టింగ్‌పై ఇష్టంతో కోచ్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందాడు. పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించటంతో రోహిత్ బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు 'జీవీఎంసీ' స్పందన



డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.

అందరివాడు అంబేద్కర్


బుచ్చింపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

- జాతి నాయకుడు కాదు జాతీయ నాయకుడు
- సామాన్యులకు వెన్నుదన్నుగా నిలిచిన మహనీయుడు
- విగ్రహావిష్కరణ సభలో సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

రోలుగుంట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జాతి నాయకుడు కాదని, జాతీయ నాయకుడని ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. జై భీం యూత్ బుచ్చింపేటలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. బ్రిటిష్ వారిని తరిమికొట్టిన తరువాత ప్రజాస్వామ్యబద్ధంగా ఈరోజు సాగుతున్న పరిపాలనా విధానానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎంతగానో దోహదపడుతోందన్నారు. సామాన్యులకు సైతం ఓటు అనే వజ్రాయుధాన్ని అందించిందీ.. అట్టడుగు వర్గాల వారికి రిజర్వేషన్ కల్పించిందీ ఆ మహానుభావుడేనన్నారు. ఆ మహనీయుడి విగ్రహాలను దళితవాడల్లోనే కాకుండా ప్రధాన కూడళ్లకు కూడా విస్తరింపజేయాలన్నారు. సినీ నటుడు జోగినాయుడు, ఎస్సై బి.నాగకార్తీక్ అంబేద్కర్ ఆశయాల గురించి వివరించారు. జై భీం యువజన సంఘం నాయకు చిరంజీవి, సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉలబాల చంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి, పలు గ్రామాలు, మండలాల నుంచి వచ్చిన జై భీం యూత్ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్

కొయ్యూరు: మండల కేంద్రంలోని ఆదివారం జరిగిన సంతలో గిరిజన యువతకు బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర దళాల్లో ఉద్యోగాలపై కొయ్యూరు సీఐ స్వామినాయుడు, ఎస్‌ఐలు రాజారావు, లోకేష్‌కుమార్ అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఇండో-టిబెట్ బోర్డర్ ఫోర్స్, ఎస్ఎస్‌బీలో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలైనట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఐటీడీఏ, పోలీసు శాఖ సహకారంతో ఉచిత భోజన, వసతి, శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై వయస్సు 18 నుంచి 28 మధ్య ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమీప పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా ఉద్యోగాలు, శిక్షణ తదితర అంశాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

బీసీ, మైనార్టీల సంక్షేమానికి కృషి



కార్యక్రమంలో పాల్గొన్న అరకు ఎంపీ మాధవి, అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. అరకులోయ పద్మాపురం గార్డెన్‌లో బీసీ మైనార్టీలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీ, మైనార్టీల అభ్యున్నతి కోసం జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమాలు అమలుచేయడం హర్షణీయమన్నారు. ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణను నాయకులు ఘనంగా సన్మానించారు.

ఎంపీ భర్త శివప్రసాద్, బీసీ సంఘం అధ్యక్షుడు నర్సింగరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు మురళీమోహన్, మహిళ అధ్యక్షురాలు దివ్య, ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ సుస్మిత, నాయకులు యాసీన్, సుత్ర, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

- మూడు కోళ్లు, రూ. 5,100 నగదు స్వాధీనం

అనకాపల్లిటౌన్: మండలంలోని సీతానగరంలో కోడి పందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ నర్సింగరావు చెప్పారు. అందిన సమాచారం మేరకు దాడి చేసి కోడి పందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసి, రూ.5,100 నగదు, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బైక్ ఢీకొట్టి మృతి చెందిన శ్రీనివాస్

పాయకరావుపేట: పట్టణంలోని జాతీయ రహదారిపై కన్సోన్సా స్కూల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎస్.రమేష్ తెలిపారు. తుని పట్టణం సీతారాంపురానికి చెందిన లంక శ్రీనివాస్(45) బైక్‌పై పాయకరావుపేట నుంచి తుని వెళ్తుండగా, తుని వైపు నుంచి ఎదురుగా వస్తున్న మరో బైక్ శనివారం రాత్రి ఢీకొంది. దీంతో శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తుని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పశువుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

తుమ్మపాల: కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న పశువులను కశింకోట పోలీసులు పట్టుకున్నారు. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ-విజయవాడ జాతీయ రహదారి మీదుగా అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే సమాచారంతో తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేసి, కంటైనర్ పట్టుకున్నారు. లారీలో ఉన్న 33 ఎద్దులను స్వాధీనం చేసుకుని, గోశాలకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు. కేసు నమోదు చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

పీఎంపాలెం(భీమిలి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. వివరాలివీ.. మధురవాడ నగరంపాలెం రోడ్డులో ఇద్దరు చిన్న చిన్న పొట్లాలు కట్టి గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సీఐ సిబ్బందితో దాడి చేసి మల్లయ్యపాలేనికి చెందిన కాయ చిన్న కృష్ణ, వాంబేకాలనీకి చెంచెల దినేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 3 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్.కోట ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే గతంలో నమోదైన గంజాయి కేసులో నిందితుడు నర్సీపట్నానికి చెందిన చంద్ర జానీ అలియాస్ సాయిబును మారికవలస కూడలిలో ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

స్కిల్ ట్రైనింగ్ జాబ్ ఫెయిర్ సలహాదారుగా శ్రీధర్‌రెడ్డి


గాదె శ్రీధర్ రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వ స్కిల్ ట్రైనింగ్, జాబ్ ఫెయిర్ సలహాదారుగా మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఎండీ గాదె శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన(పొలిటికల్) విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ విజయసాయిరెడ్డికి, ఉమ్మడి విశాఖ జిల్లా పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి శ్రీధర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి ప్రభుత్వానికి, పార్టీకి మరింతగా సేవ చేస్తానని వెల్లడించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి


మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

డీఈవో లింగేశ్వర రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న లింగేశ్వరరెడ్డి

అనకాపల్లిటౌన్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక వేల్పులవీధి జీవీఎంసీ బాలికోన్నత హైస్కూల్ ఆవరణలో ఆదివారం జిల్లాలో ఐదు మోడల్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలన్నారు. ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. సబ్జెక్టుల వారీగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ఆదారి రవిబాబు, ఏపీవో వెంకటేశ్వరరావు, తేగాడ, పాటిపల్లి, మరుపాక, మంచాల, వేములపూడి మోడల్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలగాలి

శ్రీరామ సప్తాహ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: శ్రీరామ నామ స్మరణతో పీఎస్‌పేట అంతా మార్మోగింది. వందలాది మంది భక్తులు ఒకే చోట చేరి భజన కార్యక్రమాలు చేయడంతో ఆ ప్రాంతమంతా భక్తిపారవశ్యంతో ఉప్పొంగింది. శ్రీరామ నామ సప్తాహ మహోత్సావాల్లో భాగంగా చోడవరం మండలం పీఎస్‌పేటలో శ్రీరామ జయరామ జయ జయ రామ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 13న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. వారం రోజులపాటు ప్రత్యేక కోలాటాలు, భజనల బృందాలతో భక్తులంతా శ్రీరామ జపం చేశారు. ఈ సందర్భంగా వేద పండితుల వేద మంత్రాల మధ్య సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొని స్వామివారికి సేవ చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలగాలన్నారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు.